క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిమిత్తం గురువారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ అక్కుల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డేశ్వరం గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని, వినియోగదారులకు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులతో పాఠశాలకు వసతులు



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సొంత నిధులతో గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే ఆర్కే పలు అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా ఈమని రాగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్ పాఠశాల అదనపు తరగతి గదుల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందిపడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే లక్ష రూపాయలు తన సొంత నిధులను కేటాయిస్తూ స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సహాయంతో పాఠశాల బిల్డింగ్ వరండాల్లో రెండు అడుగుల వాల్‌తో పాటు గ్రిల్స్ నిర్మాణ పనులు చేపట్టారు.

పోలీస్ కవాతు

ఫిరంగిపురం: రానున్న ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును ప్రజలు వినియోగించుకోవాలని తుళ్లూరు డీఎస్పీ ఇ.అశోక్‌కుమార్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. సీఐఎస్‌ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ పి.వీరేంద్రబాబు, ఎస్‌ఐ సీహెచ్ సురేష్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన

మేడికొండూరు: మండల కేంద్రంలోని సచివాలయం–2లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బాల్య వివాహాలపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలికలకు 18, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తరువాత వివాహం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. బాల్య వివాహాలు చేస్తే పది రకాల అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సాదిక్, సీహెచ్ఓ రమణారావు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో నవరంగ్ కాంగ్రెస్ పార్టీ పోటీ

తాడేపల్లిరూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రాజ్యాధికారం కోసమే నవరంగ్ కాంగ్రెస్ పార్టీ ఉద్భవించిందని పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఏపీలో నవరంగ్ కాంగ్రెస్ పార్టీకి బకెట్ గుర్తును కేటాయించిందని, ఏపీలో 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ సమావేశంలో సయ్యద్ సైదా, గుర్రం రామారావు, షేక్ రఫీ, షేక్ మస్తాన్, పప్పుల సాంబశివరావు, గబ్బర్ బాషా పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ముందు వెళ్తున్న వాహనాన్ని మరో బైక్ ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. వేములూరిపాడుకు చెందిన బి.నరసింహారావు స్థానికంగా ఉన్న కంపెనీ డ్యూటీకోసం బైక్‌పై వెళ్తున్నాడు. కాగా మరో వాహనంపై గుంటూరు వెళ్తున్న శ్రీకాంత్ ప్రమాదవశాత్తు మూల మలుపు వద్ద ఒక దానిని మరో వాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సురేష్ ఘటనా స్థలానికి వెళ్లి వారిని చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి 108లో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యేక మెడికల్ క్యాంపు

తాడేపల్లిరూరల్: ఇప్పటంలో గ్రామంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గత కొంత కాలం నుంచి అనారోగ్య పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. సమాచారం అందుకున్న ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ ప్రభుత్వ వైద్యులతో చర్చించి ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. కమిషనర్ నిర్మల్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటంలో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని, కొంతమంది తాగునీటి కారణంగా అని చెబుతున్నారని అయితే వాటర్ కంటెంట్‌లో ఎటువంటి మార్పు లేదని, గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పరిస్థితులను పరిశీలిస్తున్నామని, ప్రజలు తమ చుట్టు ఉన్న ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, పంచాయతీ సెక్రటరీ ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ మహిళ లావణ్య విజయం తథ్యం

- బలహీన వర్గాలను రాజ్యాధికారం వైపు నడిపించడమే ధ్యేయం
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), నియోజకవర్గ సమన్వయకర్త మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల

మంగళగిరి: బలహీన వర్గాలను రాజ్యాధికారం వైపు నడిపించడమే వైఎస్సార్ సీపీ ధ్యేయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారాన్ని బుధవారం ప్రారంభించారు. తొలుత నగర పరిధిలోని గణపతినగర్ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మురుగుడు లావణ్య, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ ఎం.హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బీసీ మహిళను నియమించడం జరిగిందన్నారు. మురుగుడు లావణ్య నియామకంపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, చేనేత సామాజిక వర్గానికి చెందిన ఆమె ఆ వర్గ సమస్యలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తారని వివరించారు. వినాయకుని ఆలయంలో పూజల అనంతరం ఇంటింటికీ వైఎస్సార్ సీపీ ప్రచార కార్యక్రమం ప్రారంభించామని, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం సరియైనదేనని అందరూ భావిస్తున్నట్లు తెలిపారు. విద్యావంతురాలైన లావణ్యను నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో జరిగిన సంక్షేమ కార్యక్రమాలతో పాటు గతంలో ఎన్నడూ లేని విధంగా జరిగిన అభివృద్ధి పనులను ఇంటింటికీ వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, పార్టీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య, జేసీఎస్ కన్వీనర్ అనిల్, తాడేపల్లి టౌన్ జేసీఎస్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, దుగ్గిరాల మండల అధ్యక్షుడు ఎస్.రత్నం, జేసీఎస్ కన్వీనర్ యేమినేని రవీంద్ర, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు వి. రజనీకాంత్, దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణకుమారి, ఎంపీపీ డి.సంతోష రూపవాణి, నాయకులు ఈపూరి ఆదాం, ఎం.ప్రకాష్, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, కలకోటి స్వరూపరాణి, సంపూర్ణ పార్వతి, కొల్లి శేషిరెడ్డి, బేతపూడి నర్సయ్య, రంగిశెట్టి పెద్దబ్బాయి, కిషోర్ పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం అభివాదం చేస్తున్న లావణ్య

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ సుదర్శన్ రెడ్డి



బహుమతులు అందజేస్తున్న సుదర్శన్ రెడ్డి

తాడేపల్లిరూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుదర్శన్ రెడ్డి అన్నారు. తాడేపల్లి బైపాస్‌రోడ్ కీర్తి ఎస్టేట్ ఆవరణలో మహిళా దినోత్సవం సందర్భంగా హార్ట్ టు హార్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ పురుషులతో పాటు మహిళలు పోటీ పడాలని అన్నారు. దేశంలో మహిళలు ముందజంలో ఉన్నారని, రాజకీయాల్లో మహిళలు చైతన్యవంతులై ముందుకు వస్తున్నారని అన్నారు. దేశంలో 50 శాతం మహిళలు అన్ని అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని చెప్పారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హార్ట్ టు హార్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మహిళా ఇన్‌చార్జి కొత్తపల్లి రజని, రిజిస్టర్ శాఖ డీఐజీ బాలస్వామి, డీఐజీ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంటీఎంసీ డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి

తాడేపల్లిరూరల్: చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు అవగాహన కోసం రూపొందించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం లభించడంతో తాడేపల్లి కార్పొరేషన్ కార్యాలయంలో డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. శివారెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మైక్రో, స్మాల్ మరియు మీడియం ఎంటర్‌ప్రైజెస్ స్కీమ్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ స్కీమ్‌పై సచివాలయాల పరిధిలో అవగాహన కల్పించేందుకు సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశామని, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు, వార్డు ఏమినిటీస్ సెక్రటరీలకు జిల్లా పరిశ్రమల విభాగం జనరల్ డైరెక్టర్ మద్యం మోహన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.

నంబూరు నాగేశ్వరరావు చిరస్మరణీయుడు



నంబూరు నాగేశ్వరరావు విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

పెదపరిమి(తాడికొండ): గ్రామాభివృద్ధికి బాటలు వేసిన మంచి మనిషి నంబూరు నాగేశ్వరరావు చిరస్మరణీయుడని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తండ్రి నంబూరు నాగేశ్వరరావు విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ అని ఫ్యాక్షన్ గ్రామంలో శాంతి కుసుమాలు కురిపించి గ్రామ సర్పంచిగా, సొసైటీ అధ్యక్షుడిగా అందించిన సేవలను కొనియాడారు. గ్రామాభివృద్ధే ధ్యేయంగా పాటుపడిన ఆయన గ్రామంలో ఫ్యాక్షన్ ముద్రను చెరిపివేయడంలో తనదైన పాత్ర పోషించారన్నారు. తనను తాడికొండ సమన్వయకర్తగా నియమించడంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారం అందించి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఎంపీ నందిగం సురేష్, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య, మచిలీపట్నం పోర్టు ట్రస్టు చైర్మన్ మేకతోటి దయాసాగర్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

భౌతిక శాస్త్ర పరిశోధనలకు అధిక ప్రాధాన్యం

వీసీ ఆచార్య రాజశేఖర్



సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: భౌతిక శాస్త్ర పరిశోధనలకు అధిక ప్రాధాన్యం ఉంటుందని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. వర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'మెటీరియల్ సైన్స్ అండ్ క్యారెక్టరైజేషన్స్ టెక్నిక్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ మెటీరియల్ సైన్స్‌పై విస్తృత పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ అధ్యాపకులు ఆచార్య సీకే జయశంకర్ కీలకోపన్యాసం చేస్తూ నేడు సైన్స్‌పై విద్యార్థులకు ఆసక్తి పెరుగుతోందని, ఇందులో భౌతిక శాస్త్రంపై ఆసక్తి రెట్టింపు అవుతుందని చెప్పారు. దీనికి కారణం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న నూతన పరిశోధనలేనన్నారు. విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించి కొత్త అంశాల్ని కనుగొనాల్సిన అవసరం ఉందని చెప్పారు. డైరెక్టర్ ఆచార్య ఎం. రామిరెడ్డి సదస్సు నిర్వహణ ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.గంగాధరరావు, సదస్సు కో– డైరెక్టర్ సంధ్యకోలే, కోశాధికారి జి. నాగరాజు, అధ్యాపకులు సీహెచ్. రవికుమార్, ఆర్ వీఎస్ఎస్ఎన్ రవికుమార్, సీహెచ్. లింగరాజు , ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అధ్యాపకులు మారం పార్థసారథి, హైదరాబాదు ఏఆర్‌సీఐ అధ్యాపకులు మణికార్తి, యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ అధ్యాపకులు కె.వెంకటాచలం తదితరులు ప్రసంగించారు. సదస్సులో సమర్పిస్తున్న పరిశోధనా పత్రాల సావనీర్ ఆవిష్కరించారు.

పరిశోధనల్లో నూతన పద్ధతులు అవలంబించాలి

పరిశోధనా రంగంలో నూతన మెలకువలు, పద్ధతులను అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో 'అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ మెథడాలజీ' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశోధన ఫలితాలు సమాజాభివృద్ధికి, మానవాభివృద్ధికి దోహదపడాలని సూచించారు. ద్రవిడియన్ యూనివర్సిటీ అధ్యాపకులు డి. శ్రీనివాస కుమార్ కీలకోపన్యాసం చేశారు. పరిశోధన పద్ధతుల్లో ప్రధానంగా శాంపిలింగ్ మెథడ్ వినియోగించాలని సూచించారు. డైరెక్టర్ పి.బ్రహ్మజీరావు వర్క్‌షాప్ ఉద్దేశాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ స్వరూపారాణి, ఎడ్యుకేషన్ విభాగ చైర్ పర్సన్ జె.ఆర్.ప్రియదర్శిని, చంద్ర మోహన్, ప్రొఫెసర్లు బి.పద్మనాభయ్య, వి. లాజర్, టి.షారోన్ రాజు పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌పై అవగాహన అవసరం



ఫిరంగిపురం: త్వరలో వేయనున్న బీసీజీ టీకాపై ప్రజలకు అవగాహన అవసరమని స్టేట్ టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్, టి.రమేష్ అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని హెల్త్ వెల్‌నెస్‌సెంటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో పెద్దలకు కూడా టీబీ వ్యాధి రాకుండా ఉండేందుకుగాను బీసీజీ టీకా వేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది వెళ్లి ప్రజలకు టీకాపై అవగాహన కల్పించారని చెప్పారు. 60 ఏళ్లు దాటిన వారికి, షుగర్, స్మోకింగ్ చేసేవారికి, గతంలో టీబీ లక్షణాలున్నవారు, వారి సన్నిహితులకు , బలహీనంగా ఉన్నవారికి కూడా బీసీజీ టీకా వేస్తామన్నారు. టీబీ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో మూడు లక్షల మందికి అవగాహన కల్పించగా వారిలో ఒక లక్ష్యా యాభై వేల మంది వరకు టీకా వేయించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ లాస్య ఉన్నారు.

మాల, మాదిగలకు సమానంగా సీట్లు కేటాయించాలి

మంగళగిరి: రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాలలతో సమానంగా మాదిగలకు సీట్లు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. నగరంలోని ఐబీఎన్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ ముసుగులో మాదిగ జాతిని, మనువాద మతతత్వ బీజేపీలకు తాకట్టుపెట్టేందుకు ఒక నాయకుడు చేసే కుట్రను తిప్పికొట్టేందుకు మాదిగలంతా ఐక్య పోరాటం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టులో ఉన్నందున ఏపీ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని న్యాయవాదులను నియమించాలని కోరారు. ప్రధాన రాజకీయ పార్టీలు మాదిగలకు కేటాయించిన సీట్లను గెలిపించుకునేందుకు ఏపీలో మాదిగల శక్తి పేరుతో త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు మల్లవరపు నాగయ్య, ఏటుకూరి విజయ్‌కుమార్, మానుకొండ శ్రీధర్, కొదమల కుమార్, రమేష్, కారుమంచి బెనర్జీ, శ్రీనివాసరావు, భూషణం, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

తుళ్లూరు అయ్యప్పస్వామి గుడిలో చోరీ

తాడికొండ: అయ్యప్పస్వామి ఆలయంలో చోరీ ఘటన మండల కేంద్రమైన తుళ్లూరులో వెలుగులోకి వచ్చింది. తుళ్లూరు సీఐ సుభానీ తెలిపిన వివరాలు.. గుర్తు తెలియని వ్యక్తులు గత రాత్రి సమయంలో ప్రహరీ దూకిలోనికి ప్రవేశించి హుండీని అపహరించుకుపోయారు. హుండీలోని సొమ్మును కాజేసి వెనుకవైపు ఉన్న ఖాళీ ప్రదేశంలో పడేసి పారిపోయారు. హుండీలో సుమారు రూ.5 వేల వరకు నగదు ఉంటుందని ఆలయ గురుస్వామి తెలిపారు. గురుస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుభానీ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన వేగవంతం

నెహ్రూనగర్: నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన వేగంగా పూర్తి చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాట్లపై ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం తన చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజరీ అధికారులు, ఏఈల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఇప్పటి వరకు చేపట్టిన మౌలిక వసతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, వికలాంగులకు వీలుగా ర్యాంపులు, విద్యుత్, తాగునీటి సరఫరా, మరుగు దొడ్లు వంటి కనీస వసతుల్ని ఎక్కడ కల్పించాలో గుర్తించామని, వాటి ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏఈల వారీగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బీఎల్‌ఓలు, సూపర్‌వైజరీ అధికారులు ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.

హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ఫిరంగిపురం: రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, పార్టీ కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. సుచరిత మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ ఎంతో శ్రమిస్తున్నారని చెప్పారు. రాజధాని ప్రాంతంలో కూలీలకు పింఛన్లు పెంచాలని కోరిన 15 రోజుల్లోనే ఆమోదించి రూ.2,500 నుంచి ఐదు వేల రూపాయలకు పెంచినట్లు వివరించారు. ఈనెల 10వ తేదీన ప్రకాశం జిల్లా మేదరమెట్లలో నిర్వహించే సిద్ధం సభకు నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు చెప్పే బూటకపు మాటలు ప్రజలు నమ్మరన్నారు. అనంతరం గ్రామాల వారీగా నాయకుల నుంచి సిద్ధం సభకు తరలివెళ్లేందుకు అవసరమైన సలహాలు అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని తూర్పుబజారు, హౌస్‌గణేష్, గొల్లపాలెం గ్రామాల్లో కార్యకర్తలు, పార్టీనాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు నన్నం సునీత, నాయకులు కె.చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, డి.సురేష్, బి.అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ జి.చంద్రం, పి.మరియబాబు, ఎస్.నాగరాజు, రమణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, కె.ఆనంద్, ఎ.రత్నం , డి.మెల్కియా, జి.కోటేశ్వరరావు, అప్పిరెడ్డి, చొడయ్య, నాగిరెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, టి.కృష్ణ, ఖాజావలి, రంజన్‌బాబు, రత్నబాబు, మస్తాన్‌వలి, బాజీ, బ్రహ్మరెడ్డి, ఈశ్వరరెడ్డి, టి.మురళి, హేమలతారెడ్డి, సత్యం, పి.చిన్న పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే ఆర్కే



స్థానికులతో కలసి రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలంలో పలు అభివృద్ధి పనులు, నూతన భవనాల ప్రారంభోత్సవాలు నిర్వహించడంతో దుగ్గిరాల మండలపరిధిలో పండుగ వాతావరణం చోటుచేసుకుంది. మండలం పెనుమూలిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎంపీపీ డి. సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణలతో కలసి బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పెనుమూలిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లను నిర్మించేందుకు సుమారు కోటి రూపాయలు విలువ చేసే స్థలాన్ని తన గ్రామం కోసం ఇచ్చిన ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు సత్యం సుబ్రహ్మణ్యంకు ప్రభుత్వం తరఫున, నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. 2.5 కోట్ల రూపాయలతో నిర్మించిన నూతన భవనాలను ప్రారంభించారు. ప్రారంభం అనంతరం స్థలదాత అయిన సత్యం సుబ్రహ్మణ్యం దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, ఎంపీటీసీ సభ్యులు షేక్ సల్మా, గ్రామ సర్పంచి కొరిటాల పద్మావతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఎస్.రత్నం, జిల్లా బీసీ సెల్ నాయకులు డి.వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు వి.రజనీకాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ నజీర్, శేషిరెడ్డి, రంగారెడ్డి, రవీంద్ర, బసరావూరి రాంబాబు, ప్రకాష్, గరిక రమేష్ పాల్గొన్నారు.

పసుపు రైతులను వెంటనే ఆదుకోవాలి



రిలే నిరాహార దీక్షలో జొన్న శివశంకరరావు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలో జనవరి నెలలో జరిగిన శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులను ఆదుకోవాలని పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు కోరారు. అగ్ని ప్రమాద పసుపు రైతులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జొన్న శివశంకరరావు మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం క్వింటాకు 14 వేల రూపాయలు నష్టపరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం నిర్లక్ష్యంగా ఉన్నారని, ఇన్సూరెన్స్ కంపెనీకి ఇంత వరకు సరైన సమాచారం అందించలేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రకృతి విపత్తుల సహాయ నిధి నుంచి రైతులను ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ దీక్ష శిబిరంలో మాజీ ఎమ్మెల్యే ఎం.వెంకట సుబ్బయ్య, పసుపు రైతు బాధిత సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకట రామయ్య, ములక శివసాంబిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు అమ్మిరెడ్డి, రైతు నాయకులు రామస్వామి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అనూరాధ

తాడికొండ: మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తయ్యేలా చూడాలని తాడికొండ ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి కోరారు. తాడికొండ మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిడుముక్కల ఎంపీటీసీ బోడపాటి సుశీల మాట్లాడుతూ వేసవి సందర్భంగా తాగునీటి ఎద్దడి దృష్ట్యా బోర్లు వేయాలని సూచించారు. ఎంపీడీఓ అనూరాధ మాట్లాడుతూ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాలేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే చర్యలకు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి పలువురు మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఏసీసీ ఫ్యాక్టరీ కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి



తాడేపల్లిరూరల్: కోర్టు ఆర్డర్ ప్రకారం ఎంటీఎంసీ పరిధిలోని కృష్ణనగర్ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఎంటీఎంసీ పరిధిలోని కృష్ణనగర్ సిమెంట్ ఫ్యాక్టరీ కేసీడబ్ల్యూ యూనియన్ కార్యాలయంలో కూరపాటి స్టీఫెన్ అధ్యక్షతన ఆల్ ట్రేడ్ యూనియన్స్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు 333 మందికి రావాల్సిన బకాయిలపై హైకోర్టు ఆర్డర్ ఉన్నా బకాయిలను చెల్లించకపోవడం అన్యాయమని అన్నారు. అన్యాక్రాంతమైన భూములను కాపాడాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, ఏఐటీయూసీ నాయకులు తుడిమెల వెంకటయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు చెన్నయ్య, ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ, ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు జె.కృష్ణబాబు పాల్గొన్నారు.